తెలీదు. అవునా?'

'అవును. అదే మొదటి పరిచయం. అందుకే మోసపోయాను. నన్ను కిడ్నాప్ చేసింది!'

తక్కున ప్రశ్నించాడు విశ్వప్రసాద్ - 'కిడ్నాప్ అంటే?'

'ఒక మైనరు బాలునిగాని, బాలికను గాని వారి ఇష్టం లేకుండా, దురుద్దేశ్యంతో ఎత్తుకు వెళ్ళి పోవటం, వాళ్ళను నీచమైన వృత్తిలోకి బలవంతంగా ప్రవేశ పెట్టటం' అన్నది పార్వతి.

'సుభద్ర నిన్ను నీచమైన వృత్తిలో ప్రవేశ పెట్టటానికి నిన్ను మభ్య పెట్టి కిడ్నాప్ చేసిందన్నావు. కిడ్నాప్ అంటే ఏమిటో చెప్పావు. కిడ్నాప్ చేసిన వాళ్ళకు నేరం రుజువైతే శిక్ష ఏమిటో చెప్పగలవా?'

నా వైపు చూసింది. తల్లి దండ్రుల వైపు చూసింది. పెదవుల మీద కనిపించీ కనిపించని చిరునవ్వు.

'తెలుసు! ఐ.పి.సి. 366-ఎ సెక్షన్ ప్రకారం, పదేళ్ళ వరకూ కఠిన శిక్ష విధించ వచ్చు' అన్నది.

మేజిస్ట్రేట్‌తో సహా కోర్టులో ఉన్న వాళ్ళంతా ఆశ్చర్య పోయారు.

'నువ్వు నూన్ షో సినిమాకు బయల్దేరావు. సినిమా హాలు దగ్గర రిక్షాలో వచ్చిన నిన్ను శ్రీమతి సుభద్ర మభ్య పెట్టి కిడ్నాప్ చేసి తనింటికి తీసుకు వెళ్ళింది. అంటే నువ్వు బయల్దేరింది సినిమాకు. ఈవిడ తారస పడుతుందని నీకు తెలీదు! అవునా?' అన్నాడు లాయర్ విశ్వప్రసాద్.

'అవునండి. నేను బయల్దేరింది సినిమాకు. ఇది వరకు పరిచయం లేని ఈ సుభద్రగారు అక్కడ తారస పడ్డారు!'

'వెరీగుడ్. అయితే నీ వెంట తెచ్చుకున్న బ్రీఫ్ కేస్‌లో ఎన్ని చీరెలూ, జాకెట్లు వున్నాయ్? నీకు అమెరికన్ జార్జెట్ అంటే ఇష్టమా, ఫారెన్ నైలెక్స్ అంటే ఇష్టమా?'

'రంగు రంగుల చీరలు ఏవయినా ఇష్టమేనండీ. ఆ వేళ బ్రీఫ్‌కేస్‌లో మూడు జతల బట్టలున్నాయి' అన్నది. అందరూ ఆశ్చర్యపోయారు.

'దట్సాల్' అన్నాడు లాయర్ విశ్వప్రసాద్.

నన్నూ కొన్ని ప్రశ్నలు అడిగారు. సమాధానం చెప్పాను. ఇక లాయర్ విశ్వప్రసాద్ తన వాదన వినిపించారు.

'యువరానర్! శ్రీమతి సుభద్ర, కుమారి పార్వతి చెప్పిన విషయాలు విన్నారు. ఆరోజున సినిమా హాలు వద్ద తనకు కనిపించే వరకూ సుభద్రతో తనకు పరిచయం లేదు అని కుమారి పార్వతి చెప్పింది.

బ్రీఫ్‌కేస్‌లో మూడు జతల బట్టలు ఉన్నాయని కూడా చెప్పింది. సినిమాకు వెళ్ళే వ్యక్తికి బ్రీఫ్ కేసు, బట్టలూ ఎందుకు? పార్వతి చదువుకున్న వ్యక్తి. ఇంటర్ ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యానని చెప్పింది. నూన్‌షోకి, ఇంగ్లీషు పిక్చర్‌కు వెళ్ళే వ్యక్తికి, బ్రీఫ్ కేస్ ఎందుకు? అందులో మూడు జతల బట్టలు ఎందుకు? మరో విషయం- కిడ్నాప్ చేసిన నేరం రుజువయితే నేరం చేసిన వాళ్ళకు ఐ.పి.సి. 366 సెక్షన్ ప్రకారం పదేళ్ళ వరకూ కఠిన శిక్ష విధించవచ్చు అని కూడా చెప్పింది. అంటే శ్రీమతి సుభద్ర మీద ఒక నేరాన్ని మోపి, అది రుజువు చేయించి, ఆమెకు న్యాయస్థానంలో శిక్ష పడేట్లు చేయాలనే పథకంతోనే. ఈ పథకం వెనక ఉన్న ఒక వ్యక్తి కుమారి పార్వతి చేత ఈ వ్యవహారం జరిపించడం జరిగింది. ఇక పార్వతి సినిమాకు వెళ్ళటం, అక్కడ సుభద్ర కలవటం కూడా అబద్ధం. ఈ పార్వతి బ్రీఫ్ కేస్ తీసుకుని రిక్షా దిగి ఉదయం పదకొండు గంటల వేళ తనంతట తానుగానే సుభద్ర ఇంటికి వెళ్ళి ఆవిడ భర్త తాలూకు బంధువుగా తనను తాను పరిచయం చేసుకుని రెండు మూడు రోజులు వున్న తరువాత పథకం ప్రకారం నిందారోపణ, ఈ కిడ్నాప్ కేసు పెట్టటం జరిగింది. శిక్షార్హురాలు కుమారి పార్వతికాని, సుభద్ర కాదు. కుమారి పార్వతిని శిక్షించవలసిందిగా కోర్టు వారికి మనవి చేస్తున్నాను' అన్నాడు.

మేజిస్ట్రేట్ పార్వతి వైపు చూసి 'నువ్వేమయినా చెపుతావా?' అన్నాడు. పార్వతి ఒక్కసారి బావురుమని ఏడ్చింది. అందరూ కంగారు పడ్డారు. రెండు నిమిషాలు గడిచాక మళ్ళీ చెప్పింది.

'యువరానర్, నేను చదువుకున్న అమ్మాయిని. ఒకానొక ప్రలోభంలో ఇరుక్కుని ఊబిలోకి దిగి పోయాను. కారణం మా పేదరికం. నా లాంటి వాళ్ళు చాలా మంది వున్నారు. డబ్బుకోసం ఈ నాటకం వేయించారు. సూత్రధారి వున్నాడు. పాత్ర ధారిని నేను. ఈ విషయం చెపితే నా ప్రాణం నాకు దక్కదు. నేను చెప్పిన వ్యక్తి మీద కోర్టువారూ, పోలీసులూ చర్య తీసుకుంటారని నాకు హామీ ఇస్తే నేనా వ్యక్తి పేరు చెప్తాను' అన్నది పార్వతి.

'నీకు తగిన రక్షణ ఇవ్వవలసిందిగా కోర్టు ఆదేశిస్తుంది. ఏ విషయం దాచకుండా చెప్పటం నీ బాధ్యత' అన్నాడు మేజిస్ట్రేట్.

'ఆ వ్యక్తి అశోక్ వర్ధన్. పరిస్థితుల ప్రాబల్యం వల్ల నేను అతనితో చేతులు కలపక తప్పలేదు. మానసికంగా, శారీరకంగా నేను అతని బందీని. నిండు న్యాయ స్థానంలో పరిస్థితుల ప్రాబల్యం వల్ల ఈ ఘాతుకమైన చర్యకు సహాయ పడ్డానని ఒప్పుకుంటున్నాను. నాకు శిక్ష విధించటం తేలిక. కాని అశోక్ వర్ధన్‌ను కోర్టు ఏం చేస్తుంది? ఏం చెయ్యగలదు? ఈ విధంగా అశోక్ వర్ధన్ ఎందుకు పగబట్టాడు అనేది సుభద్రాదేవిని ప్రశ్నించండి' అన్నది పార్వతి.

'ఎస్. యు కెన్ ప్రొసీడ్' అని పి.పి. వైపు చూశాడు మేజిస్ట్రేట్.

'అశోక్ వర్ధన్ అనే వ్యక్తి ఈ పరిస్థితికి కారణం, ఈ నాటకం అతనే ఆడించాడని అన్నది పార్వతి. నిజమేనా?' అని నన్ను ప్రశ్నించాడు పి.పి.

'నిజమే. నాకు వివాహం కాని రోజుల్లో, నేను చదువుకునే రోజుల్లో, అశోక్ వర్ధన్ నన్ను మభ్య పెట్టి తన ఇంటికి తీసుకు వెళ్ళి నన్ను రేప్ చేశాడు. ఆ నేరం రుజువై అతనికి మూడేళ్ళ శిక్ష పడ్డది. జైలు నుంచి వచ్చాక అతనిలో పగ, కక్ష, కార్పణ్యం పేరుకు పోయింది. దాని పర్యవసానమే నా మీద మోపిన ఈ కిడ్నాప్ కేసు' అని చెప్పాను.

## కాలమ్ దాటని కథ



### చివరి ప్రశ్న

శాంతను చూడ వచ్చినవారు ఎన్నో ప్రశ్నలడిగారు. శాంతంగా అన్నిటికీ సమాధానాలు చెప్పింది. "అమ్మాయీ నువ్వు యమ్.ఎ. పాసయినావు కదా! ఉద్యోగం చేస్తావా" అని వరుడి తండ్రి చివరి ప్రశ్న అడిగాడు, పిల్ల నచ్చినదని అంటూ. "ఒకరు ఉద్యోగంలో ఉన్నారు కదా! నేనెందుకు చేయాలి?" అన్నది శాంత. "ఏదో, వేడినీళ్ళకు చన్నీళ్ళగా" అన్నది వరుడి తల్లి. "నేను చేయను". "చదివిన చదువు వృథా అయిపోతుంది కదా!" అని నసిగింది ఆ వరుడి తల్లి.

"వృథా కాదు. విశ్రాంతిగా గ్రంథాలు చదువుకోవ డానికి పనికి వస్తుంది వంటా వార్పూ అయిన తర్వాత." "అలా అంటే ఎల్లాగమ్మా! డబ్బు చేదా? డబ్బు చుట్టూ లోకం తిరుగుతూ ఉంటుంది కదా!" "ఈ సంబంధం స్థిరమయితే, మా నాన్న మీ కెలాగూ ఇరవై వేల రూపాయలు కానుకగా ఇవ్వదలచుకున్నాడని తెలిసింది. నాకు కూడా అంతే మొత్తం ఇవ్వదలచుకున్నాడు. ఈ నలభై వేలూ మానాన్న సొమ్మేకదా! దానిని ఫిక్స్‌డ్ డిపాజిట్టు చేసుకుంటే ఏదో కొంత వడ్డీ వస్తుంది. అప్పుడు నేను మీకు బరువు కాదు కదా! అవే వేన్నీళ్ళు- అవే చన్నీళ్ళు!" అన్నది శాంత తాపీగా.

"మీ నాన్న ఇవ్వదలచుకున్నదానితో మా కవసరం వుంటుంది కదా!" అన్నాడు వరుడి తండ్రి. "అయితే ఆ కానుకయినా వదులుకోండి-లేదా, మీ కాబోయే కోడలు బయట నౌకరీ చేసి, మీకు వండి పెట్టాలనే ఆశ అయినా వదులుకోండి." అని శాంత చరచరా లోపలకు వెళ్ళిపోయింది చివరి ప్రశ్నకు బదులుగా. - పైడిపాటి సుబ్బరామ శాస్త్రి